# జానకి

శ్రీమతి చివుకుల లక్ష్మీపున్నయ్య

జానకి అత్తగారింట్లో జీవితమును గురించి తెలిసిన వారు ప్రతియొక్కరు 'అయ్యో పాపం!' అంటూ సానుభూతి చూపక మానరు. పుట్టింట్లో తను మూడవ ఆడబిడ్డ అయినా ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా యింటిల్లిపాదిని రంజింపజేస్తూ, మంచిగా నయితేనేమి, అఘాయిత్యంగా నయితేనేమి తన కోర్కెలను సాఫల్యంచేసికునేది. తెల్లగా పిండి బొమ్మలాగుండి, ముఖంపైన చిందులుత్రొక్కే ముంగురులతో, చిరునవ్వులు వెదజల్లే దొండపండు లాంటి పెదిమలతో, అమాయకత్వాన్ని, కొంటెతనాన్ని సమానంగా స్ఫురింపజేస్తున్న కనుదోయితో ఎంతో అందంగా, ప్రత్యేకమైన కళాకాంతులతో నుండే జానకి అత్తగారియింట్లో వాడిపోయిన ముఖం, నిస్పృహ నిరాశలతో క్రుంగిపోతున్న హృదయం, నల్లకప్పేసిన దేహచ్ఛాయ ఆమె రూపాన్నే కాకుండా వ్యక్తిత్వాన్నే మార్చేసినవి. దానికి కారణము అత్తగారిల్లు తినకుడువలేనిదైకాదు. ఇరవైయకరాల భూస్థితి, ధనం ధాన్యం సమృద్ధిగానున్న సంసారమే. ఆమె భర్త నెలకు నాలుగువందల రూపాయలు సంపాదిస్తున్న ఉద్యోగి. ఇదంతా చూచే ఆమె తండ్రి ఏరికోరి ఆ సంబంధాన్ని చేశాడు. అయితే ఏం! - నూతనంగా ఆడపిల్ల అత్తగారింటికి కాపరానికని పోతూ ఏసుఖసౌభాగ్యాలను ఆశిస్తూపోతుందో అవి మాత్రం కరువైనవి. ఆమెకు ఆ యింట్లో దక్కినవి యింటివెట్టిచాకిరి. ఆ చాకిరైనా ప్రేమ, సద్భావముల వాతావరణములోవి కావు. ఎప్పుడూ అత్తగారి, ఆడబిడ్డల పురమాయింపులు, ఛీదరింపులు, చీవాట్లుంటుండేవి. భర్త తన ఉద్యోగమేమో — తనేమో — ఎక్కడెక్కడో తిరుగుతుండేవాడు; అప్పుడప్పుడు వస్తూపోతూండేవాడు. మామగారు వృద్ధులు. ఆయన కోడలిని ఆదరాభిమానములతో చూస్తున్నా ఆయన మాటను అత్తగారు, ఆడబడచులు లక్ష్యంచేసేవారుకారు. జానకి మాత్రం ఓపికగా తను ఎంతకష్టపడుతున్నా, సుఖమునేదిలేకపోయినా ఎట్టి పొరపులేకుండా ఆ సంసారంలో కాలక్షేపంచేయసాగింది. అన్నిటికంటె విచిత్రమేమిటంటే ప్రతి యువతి ఆశించే భర్తప్రేమానురాగాలుకాని, ఆదరణకాని, మంచిచెడ్డల విచారణకాని లేకపోవడం. అత్తగారు, ఆడబిడ్డలు యింట్లో ధాన్యం వగైరాలను చాటుమాటుగా అమ్మకొని ఆదాచేసికుంటూ నగలు నాణ్యాలతో వినోదంగా విలాసంగా నుంటుంటే తన కనీసావసరాలనైనా గుర్తించేవారు ఆ యింట్లో లేకపోవడం ఆమెకు చాల బాధగా నుండేది. ఒక మూర పూవులు కొనుక్కోడానికి సయితము ఏనాడైనా పుట్టింటినుండి తల్లియో తండ్రియో నాలుగు రూపాయలు పంపేదానికి ఎదురుచూడాల్సివచ్చేది. ప్రొద్దస్తమానము యంత్రములాగ చాకిరిలోనే సరిపోతుంటుందికాని ఉన్న చీరలయినా, ఒకటి, రెండు నగలైనా ధరించి ముచ్చట తీర్చుకోడానికి అవకాశాలుండేవికావు.

రాత్రింబగళ్లు యింత చాకిరిచేసి, వండి, వార్చి వేళకు పెడుతున్నా భర్తరాక అనిశ్చితం. ఆడబిడ్డల పురమాయింపులు మహాదొడ్డవి. ఆ యింట్లో ఎవరి ఆదరణ, సానుభూతిలేకపోగా కూరలో ఉప్పు ఎక్కువైందనో, కారంతక్కువైందనో, అన్నంచిమిడి ముద్దయిందనో ఆడిపోసుకుంటూ జానకి హృదయాన్ని గాయపరస్తుండేవారు. జానకి కాబట్టి ఆ వాతావరణంలో సరిపెట్టుకపోతున్నదికాని మరొకరు ఒక్క క్షణమైనా సహించలేరు. నెలకు ఒకసారి పుట్టింటినుండి తన అన్నదమ్ములు చూడవచ్చి ఆమెపడే యాతనను చూచి బొటబొట నీరుకార్చేవారు; తల్లి కృంగిపోయేది. తన స్వంత సుఖమును, సౌభాగ్య

మును త్యాగంచేసి తన సంసారంపట్ల ఆసక్తిచూపడం ఆ యూళ్లో ప్రతియొక్కరిని చకితులనుచేసేది.

జానకి భర్త రామారావు విద్యాధికుడే కాని ఉత్తమ సంస్కారముకాని, వాస్తవిక పరిజ్ఞానంగాని, హృదయలాలిత్యముకాని కలవాడుకాడు. తన జీతంలో మూడువందల రూపాయలు తల్లి చేతుల్లో పోసేవాడు. వందరూపాయలు తను ఖర్చుపెట్టుకుంటూ స్వేచ్ఛగా తిరిగేవాడు. తన భార్య యోగక్షేమాలుకాని, అవసరాలుకాని అతని దృష్టిలోనే యుండేవికావు. తన కష్టసుఖాలను గురించి చేసుకున్న భర్తతో నోరువిప్పిచెప్పడానికి అవకాశముండేదికాదు. ఇంట్లో యున్నంతసేపు తల్లి, ఆడబిడ్డలు అతనిని చుట్టుకొని చుట్టుకొని తిరిగేవారు. ఇల్లు బయలుదేరి వెళ్ళితే ఎప్పుడు వస్తాడో, ఎక్కడికి వెళ్ళతాడో ఆమెకు తెలిసేదికాదు.

ఇలా నెలలు, సంవత్సరాలు దొర్లిపోతున్నవి. వాతావరణము మరింత వేడెక్కసాగింది. కూర్చొని తినమరిగిన అత్త, ఆడబిడ్డలు జానకిమీద మరింత పెత్తనం చలాయించసాగారు. అయినా యీనాటి కంటె రేపు మెరుగుగా నుంటుందనే ఆత్మవిశ్వాసమే జానకిని సజీవంగా నుంచుతున్నది. ఇంతలో రామారావుకు ఢిల్లీకి ఉద్యోగం ట్రాన్సఫర్ అయింది. అది వినేసరికి జానకి సంతోషపడింది. ఈ విధంగానైనా యీ పెను రొంపిలాంటి సంసారమునుండి బయటపడి భర్తతో సుఖంగా ఢిల్లీలో సంసారం చేయవచ్చుకదా యనుకుంది. కాని అలా జరుగకుండా అత్తె, ఆడబిడ్డలు అడ్డం పడిపోయి, యిల్లు వాకిలి చూచుకొని కాపురం పెట్టవచ్చులే అని చెప్పి రామారావును ఢిల్లీకి సాగనంపారు.

అసలే ముక్కిడి, ఆపైన పడిశం అన్నట్లు రామారావు పోవడంతో ఆడిపోసుకోడం, ఛీదరింపులల్లా జానకిపై దెబ్బలుగా మారినవి. అయినా ఆ యింట్లో తన ఏకాకితనాన్ని గుర్తించి, త్వరలో భర్తవచ్చి ఢిల్లీకి పిలుచుకొని వెళ్లుతాడుకదాయని ఓర్పుతో నాలుగు నెలలు ఎదురు చూచింది. కాని ఆ సూచనలు కనుపించలేదు. ఇక ఆ యమకూపంలో నుండటం ఆత్మవిధ్వంసకమనుకుంది. ఇల్లు బయలుదేరింది — ఎక్కడికో! — అత్త ఆడబడుచులు నిలవేసి అడిగారు ఎక్కడికని — చిరునవ్వుతో "నాకేం తెలియదు. కాని నేను పోయేచోటు యీ యింటికంటె మెరుగైందే. నేను చేయబోయేపని పుణ్యం, పురుషార్థముల సమకూర్చుకలది. నేను వెళ్లుతున్నాను..." అంటూ దూసుకొని వెళ్ళింది జానకి.

మరునాడు ఉదయం కుంపటి మూల కూర్చొని కునికిపాట్లు పడుతున్నది. అలమారలోని గిన్నెలు విశ్రాంతి ననుభవిస్తున్నవి. వేళతప్పకుండా కాఫీ, ఫలహారాలు, భోజనములారగిస్తూ యుండిన అత్తె, ఆడబిడ్డలు పాచిపనిచేయడానికి, అంట్లు, చెంబులు తోమడానికి బయలుదేరక తప్పిందికాదు - తిని కూర్చొని సుఖపడ్డ జీవాలుకదూ!

జానకి పుట్టింటికి పోతుందని అనేకులు భ్రమపడ్డారు. కాని అది తన వ్యక్తిత్వానికి లోటని తెలుసుకున్న జానకి మరొక గ్రామం చేరింది. అక్కడ ఒక పూరిపాకలో పెద్దల సానుభూతి, సహకారాలతో చిన్న పాఠశాల పెట్టింది. అందులో బాలలకు విద్యావిజ్ఞానాలను ప్రబోధిస్తూ, సంగీతము నేర్పుతూ జీవయాత్ర సాగించడం మొదలు పెట్టింది. శ్రీ సాయిబాబా కరుణాకటాక్షములను మానవ సేవకు తన జీవితాన్ని అంకితంచేసింది. ఆమెలోని పవిత్రత, విశ్వమానవప్రేమ, త్యాగసేవాసక్తి మహత్తరమైనవిగాను, ప్రజలకుపయుక్తముగా నయినవి.

మరి ఏనాటికైనా పిలుచుకొని పోవడానికని రామారావు జానకి దగ్గరకు వస్తాడేమో!

—X—